సాక్షి
యాదాద్రి భువనగిరి
7

బుధవారం । 22 । మార్చి । 2023



చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొని 20మందికి తీవ్ర గాయాలు కాగా.. మరో 20 మందికి స్వల్పగాయాలయ్యాయి. - 8లో



ఆస్పత్రి ఎదుట ఆందోళన
వైద్యం అందకే శిశువు మృతి చెందిందని దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట కొందరు ఆందోళనకు దిగారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33°/22°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదకరంగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోస్టాఫీస్ ద్వారా భద్రాద్రి తలంబ్రాలు

భువనగిరి : శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే సీతారాముల కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలు ఇంటి వద్దకే స్పీడ్ పోస్ట్ ద్వారా అందించడానికి ఏర్పాట్లు చేసినట్లు భువనగిరి సబ్ డివిజన్ పోస్టల్ అధికారి భూమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చన, కల్యాణ తలంబ్రాలు రూ.450లు, ముత్యాల తలంబ్రాలుకు రూ.150లు ఉందని పేర్కొన్నారు. ఈ నెల 28 వరకు బుక్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. భద్రాచలం వరకు వెళ్లలేని భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్: 2022–23 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని, గడువు 31వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు.

వడ్లు కొంటాం..

యాసంగి ధాన్యం కొనుగోలుకు అధికార యంత్రాంగం సన్నద్ధం

- ఏప్రిల్ 15 నుంచి కేంద్రాలు ప్రారంభం
- 5 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం
- వరిసాగు విస్తీర్ణం 2.84 లక్షల ఎకరాలు
- ధాన్యం ఉత్పత్తి అంచనా 6 లక్షల మెట్రిక్ టన్నులు
- మిల్లుల కెపాసిటీ మేరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాలని నిర్ణయం



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

కొనుగోలు కేంద్రాలు 300	
ఐకేపీ 78	పీఏసీఎస్ 217
మార్కెట్ కమిటీ కేంద్రాలు 05	
అవసరమైన గన్నీ బ్యాగులు 1.20 కోట్లు	అందుబాటులో ఉన్నవి 60 లక్షలు

సాక్షి, యాదాద్రి: యాసంగిలో రైతుల ధాన్యం కొనుగోలు చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఏప్రిల్ 15 నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని అధి కారులు నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం రవాణా, మిల్లుల కేటాయింపుపై ఇప్పటికే జిల్లా నివేదికను సమర్పించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైస్ మిల్లులు, రవాణా, పీఏసీఎస్, ఐకేపీ, సివిల్ సప్లయ్, మార్కెటింగ్, రవాణా శాఖలతోపాటు వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ వాహన యజమానులతో అధికారులు సమావేశం కానున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ధాన్యం దిగుబడి ఈసారి అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పెరిగిన వరి సాగు

పుష్కలంగా నీరు, ఉచిత విద్యుత్, స్థానికంగా ధాన్యం కొనుగోలు వంటి సానుకూల అంశాలతో రైతులు రికార్డు స్థాయిలో వరిసాగు చేశారు. గతేడాదికంటే ఈసారి వరి సాగు భారీగా పెరిగింది. గత యాసంగి సీజన్‌లో 1,65,761 ఎకరాల్లో వరిసాగు చేయగా, 3.14,947 ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈసారి సీజన్‌లో 2.84,654 ఎకరాల్లో వరిసాగు చేయగా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆయకట్టు, నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లో ధాన్యం కోతలకు వస్తున్నాయి.

2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇతర జిల్లాలకు..

6 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడిలో 5 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 44 రైస్ మిల్లుల కెపాసిటీ మేరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాలని నిర్ణయించారు. మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇతర జిల్లాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యంలో సన్నాలు, స్థానిక అవసరాలు, విత్తనపు వడ్లు ఇలా పలు రకాలుగా రైతుల వద్దే ఉంచుకోనున్నారని అధికారులు అంచనా. అయితే అవసరమైన గన్నీబ్యాగులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, క్లీనింగ్ మిషన్లు అధికారులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో మొత్తం 1.20 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం కాగా ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం వద్ద 60 లక్షలు అందుబాటులో ఉన్నాయి. మరో 60 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కానున్నాయి. కొనుగోళ్ల ప్రారంభం కాగానే తరలించడానికి గన్నీ బ్యాగులు సిద్ధం చేయనున్నారు. ధాన్యం కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడానికి ట్యాబ్స్‌ను మార్కెటింగ్, పీఏసీఎస్, డీఆర్‌డీఓ, సివిల్ సప్లయ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు.

300 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రైతులు ధాన్యం అమ్ముకోవడానికి జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలకు 321 గ్రామాలను అనుసంధానం చేయనున్నారు. ఇందులో ఐకేపీ 78, పీఏసీఎస్ 217, మార్కెటింగ్ శాఖ 5 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయనున్నారు. కొనుగోలు కోసం అధికారులతోపాటు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు బంధు సమితిలు, సింగిల్ విండో పాలకవర్గాలు పరస్పర సహకారం తీసుకోనున్నారు.

గ్రేడ్- ఏ ధాన్యం క్వింటా మద్దతు ధర రూ.2,060

క్వింటా ధాన్యం మద్దతు ధరను ఈసారి ప్రభుత్వం పెంచింది. గ్రేడ్- ఏ రకం క్వింటాకు రూ.2,060 కాగా గ్రేడ్ - బీ రకం రూ.2,040 చెల్లిస్తుంది. అయితే గత సీజన్‌లో రూ.1400 నుంచి రూ.1470 వరకు పెద్ద ఎత్తున మిల్లర్లు కొనుగోలు చేశారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మద్దతు ధర లభించనుంది.

ఏర్పాట్లు చేస్తున్నాం



ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సోమవారం పౌరసరఫరాల కమిషనర్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తాం. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో త్వరగా జమయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. ఏప్రిల్ 15 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు జరుగుతుంది.

– డి.శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్

సకల శుభాల శోభకృత్





ఏడాదికోసారి అయితేనేం.. వేప తియ్యగా నవ్వుతుంది.. తలనిండా నక్షత్రాలను పులుముకుని చెఱకుగడ అహపుచెక్కను విదుల్చుకొని చేదును మనసారా కౌగిలించుకుంటుంది.
కారం వగరూ మమకారాన్నీ, ఉప్పు పులుపూ వలపును వాయినాలిచ్చుకుంటాయి.
శ్రీ శోభకృత్ నామసంవత్సర ఉగాది.. అందమైన ఆకాంక్షలు కలబోసుకున్న ఆనందాల పునాది

- అరవిందరాయుడు దేవినేని, ఉపాధ్యాయుడు, మోత్కూరు

• ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన మోదీ



రామన్నపేటలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీచైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బందా నరేందర్‌రెడ్డి

- వివరాలు 8లో

ముక్తాపూర్‌లో నేహాశెట్టి



భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్‌లో జరిగిన 'రూల్స్ రంజన్' సినిమా షూటింగ్‌లో హీరోయిన్ నేహాశెట్టి

మోత్కూరులో ఉగాది బోనం ప్రత్యేకం

- ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మకు చలి బోనాల సమర్పణ
- పట్టణంలో ఎడ్ల బండ్ల ప్రదర్శన
- 80 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ

మోత్కూరు: తెలుగు నూతన సంవత్సర పర్వదినమైన ఉగాదికి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీకి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజలు ఉగాది పండుగను బోనాలతో నిర్వహిస్తారు. పూర్వకాలం నుంచి ఈ పండుగను ప్రతియేటా ఇలా వినూత్న రీతిలో జరుపుకుంటారు.

80 ఏళ్ల క్రితం మొదలైన ఆనవాయితీ..

సుమారు 80 ఏళ్ల క్రితం మోత్కూరులో కలరా ప్రబలి చాలా మంది చనిపోయారు. ఎంత వైద్యం చేసినా నయం కాకపోవడంతో అప్పట్లో ముత్యాలమ్మ తల్లి ఆగ్రహించిందని, బోనాలు సమర్పించాలని అప్పటి పెద్దలు నిర్ణయించారు. ఆ ఆచారం ప్రకారం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఊర ముత్యాలమ్మకు చలి బోనాలు సమర్పిస్తుంటారు. అలా మొదలైన పండుగ నేటికీ కొనసాగుతోంది. ఇక్కడ ఉగాదికి పచ్చడి, మద్యం, మాంసంతో పాటు ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు నిర్వహించి అక్కడికి చేరుకున్న బోనాలతో ముత్యాలమ్మకు నైవేద్యంగా పెడతారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం, జామచెట్లబావి, కొండాపురం గ్రామాల ప్రజలు కూడా గ్రామ దేవతలకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పిస్తారు. తెలుగు సంవత్సరమైన ఉగాదికి ఇక్కడి ప్రజలు ఇలా స్వాగతం పలుకుతారు. సాయంత్రం వేళల్లో దేవాలయాల వద్ద జరిగే పంచాంగం శ్రవణ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, ప్రజలు హాజరవుతారు.



ముత్యాలమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు (ఫైల్)

'శ్రీశోభకృత్' శోభాయమానంగా ఉండబోతుంది



యాదగిరిగుట్ట: శ్రీశుభకృత్ నామ సంవత్సరం అన్ని శుభాలను ఇచ్చింది. ఇక శోభకృత్ నామ సంవత్సరం మరింత శోభాయమానంగా ఉండబోతుంది. శుభకృత్ సంవత్సరంలో అద్భుతమైన యాదాద్రీశుడి ఆలయాన్ని పునః ప్రారంభించుకొని భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాదిలో భద్రాది రాముడి ఆశీస్సులతో పుష్కరాలు సైతం వస్తుండటం సంతోషకరం. ఇక ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రీశుడి ఆలయంలో ఉదయం షడ్రుచులతో శ్రీస్వామి వారికి కొత్త కుండలో నివేదిస్తాం. సాయంత్రం 5.30 గంటలకు తూర్పు మాఢవీధిలోని బ్రహ్మోత్సవ మండపంలో పంచాంగ శ్రవణం ఉంటుంది.

– వెంకటాచార్యులు, యాదాద్రి దేవస్థానం ప్రధానార్చకులు

అవసరమైన ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్: రంజాన్ మాసం ప్రారంభమవుతున్నందున అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈద్గాలు, మసీదుల వద్ద పారిశుద్ధ్య చర్యలు, మంచినీటి సరఫరా, వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండరాదని చెప్పారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో మసీదుల వద్ద తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అమలు పక్కాగా ఉండేలా జిల్లా పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముస్లింల కోసం ఆలేరు నియోజకవర్గానికి రూ.2లక్షల నిధులు, 1000 గిఫ్ట్ ప్యాకెట్లు, భువనగిరి నియోజకవర్గానికి రూ.3లక్షల నిధులు, 1500 గిఫ్ట్ ప్యాకెట్లు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓలు భూపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ ఇన్‌చార్జ్ అధికారి యాదయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తుల స్వీకరణ

భువనగిరిటౌన్: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రైవేట్ పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఈ స్కీం ఒకటో తరగతి, ఐదో తరగతి విద్యార్థులకు వర్తిస్తుందని పేర్కొన్నారు. జిల్లాకు ఒకటో తరగతి డేస్కాలర్‌షిప్ కు 22 సీట్లు, 5వ తరగతి రెసిడెన్షియల్‌కు 22 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఫీ రీయంబర్స్‌మెంట్ కింద ఒకటో తరగతికి రూ.28 వేలు, 5వ తరగతికి రెసిడెన్షియల్ కు రూ.42వేలు చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని, పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు.

రైతుల పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మోటకొండూర్: జాతీయ ఉపాధి హామీలో భాగంగా రైతులకు సంబంధించిన పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు డీఆర్‌డీఓ నాగిరెడ్డి తెలిపారు. గురువారం మోటకొండూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సోషల్ ఆడిట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశం వద్ద కూలీల హాజరును తప్పనిసరిగా ఎన్‌ఎంఎంఎస్ ఆప్ ద్వారా ప్రారంభ, ముగింపు ఫొటోను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆధార్ అనుసంధానం లేని, రిజెక్ట్ అయిన కూలీల అకౌంట్‌లను త్వరితగతిన గుర్తించి 100శాతం అకౌంట్‌ల్లో కూలి డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మోటకొండూర్, సికింద్రనగర్ నర్సరీలను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ కిషన్, అరుణ, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

రాజాపేట: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కుర్రారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. కుర్రారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, గీత కార్మికుడు బూరుగు రమేష్ రోజుమాదిరిగా మంగళవారం మధ్యాహ్నం గ్రామంలో తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు జారడంతో చెట్టు పైనుంచి కిందపడ్డాడు. తీవ్రగాయాలపాలైన రమేష్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రమేష్ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గాయపరిచిన కేసులో ముగ్గురికి జరిమానా

రామన్నపేట: పాత గొడవలను మనసులో పెట్టుకొని కక్కిరేణి గ్రామంలో మహిళను, ఆమె కూతురును కొట్టి గాయపరచిన కేసులో ముగ్గురు నిందితులకు రూ.3000 జరిమానా విధిస్తూ రామన్నపేట జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ చందన మంగళవారం తీర్పు వెల్లడించారు. 2017లో ఈ కేసు నమోదు అయింది. బాధితుల ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ బి. నాగన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి చార్జ్‌షీట్ నమోదు చేశారు. ఏపీపీలు అవినాష్, ఖాజా నిజాముద్దీన్‌లు బాధితుల పక్షాన వాదనలు వినిపించారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 20 మందికి తీవ్రంగా.. మరో 20మందికి స్వలంగా గాయాలు
- పలువురి పరిస్థితి విషమం.. గాంధీ ఆస్పత్రికి తరలింపు
- యాదాద్రి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఘటన



టేకులసోమారం వద్ద చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు, నుజ్జునుజ్జయిన ముందు భాగం



ప్రమాదంలో గాయపడిన యువతిని హైదరాబాద్‌కు తరలిస్తున్న సిబ్బంది

వలిగొండ /భువనగిరి: ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొని 20మందికి తీవ్ర గాయాలు కాగా.. మరో 20మందికి స్వల్పగాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపి 24జెడ్ 0119) మంగళవారం నల్లగొండ నుంచి 40మంది ప్రయాణికులతో భువనగిరికి బయలుదేరింది. మార్గమధ్యలో వలిగొండ మండలంలోని టేకులసోమారం వద్ద రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన చిన్నారిని తప్పించబోయి బస్సు డ్రైవర్ పక్కనే ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులందరికీ గాయాలయ్యాయి. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనాల్లో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన 20మంది మినహా స్వల్పగాయాలైన వారు ప్రమాద స్థలం నుంచే వేరే వాహనాల్లో స్వస్థలాలకు వెళ్లిపోయారు.

భువనగిరి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స

టేకులసోమారం గ్రామం వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను నాలుగు అంబులెన్స్‌లలో భువనగిరి పట్టణంలోని ఆస్పత్రికి తీసుకవచ్చారు. సుమారు 20 మందిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే వారికి వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ఇందులో పలువురు మహిళలతో పాటు వంశిక అనే చిన్నారి ఉంది. అయితే వారి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారిని వివిధ పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు.

అరగంటకు పైగా బస్సులోనే ఇరుక్కున్న డ్రైవర్

ప్రమాదానికి గురైన బస్సులోని డ్రైవర్ క్యాబిన్ స్టీరింగ్‌కు మధ్యన ఇరుక్కుని ఆటగంటకు పైగా బాధపడ్డాడు. పోలీసులు, ప్రజలు డ్రైవర్ లింగ్యానాయక్‌ను అతి కష్టం మీద బయటకు తీశారు. అతనిని వెంటనే పోలీసు వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన డ్రైవర్ లింగ్యానాయక్





ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

పుణ్యస్నానం ఆచరిస్తూ పరలోకాలకు..

- యాదాద్రి లక్ష్మీ పుష్కరిణిలో మునిగి భక్తుడు మృతి
- మృతుడు వనపర్తి జిల్లా వాసి



లక్ష్మీపుష్కరిణి మెట్లపై మౌలాలి మృతదేహం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండ దిగువన గల లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తున్న ఓ భక్తుడు నీట మునిగి మృతిచెందాడు. స్థానికులు, ఆలయ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మౌలాలి (19) తన తల్లి ఖాజాభానుతో కలిసి మంగళవారం యాదాద్రీశుడి చెంతకు వచ్చాడు. ఈ క్రమంలో ఉదయం 9గంటల ప్రాంతంలో మౌలాలి గండిచెరువు సమీపంలోని లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వెళ్లాడు. మౌలాలికి ఈత రాకపోవడం, అదే సమయంలో ఫిట్స్ రావడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న భక్తులు గమనించి అతడిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఊపిరి ఆడకపోవడంతో విగతజీవుడయ్యాడు. ఘటనా స్థలాన్ని యాదగిరిగుట్ట ఎస్‌ఐ చంద్రశేఖర్, దేవస్థానం పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతదేహానికి భువనగిరి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి ఖాజాభాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పుష్కరిణిలో భక్తుడు మృతిచెందిన నేపథ్యంలో ఆచార్యులు సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం భక్తుల పుణ్యస్నానాలకు అనుమతించారు.

దుబాయిలో కప్పలకుంటతండా వాసి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి..
- స్వగ్రామం చేరిన మృతదేహం.. అంత్యక్రియలు పూర్తి



వెంకటేశ్వర్లు (ఫైల్)

మేళ్లచెరువు: పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల పరిధిలోని కప్పలకుంటతండాకు చెందిన ధారావత్ వెంకటేశ్వర్లు (45)కు, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్లు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, గ్రామంలో కూలి పనులు లభించకపోవడంతో వెంకటేశ్వర్లు ఉపాధి నిమిత్తం 2015లో దుబాయ్ వెళ్లాడు. అక్కడే తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కాగా, ఇటీవల కాలంలో కుటుంబంలో జరుగుతున్న కలహాల కారణంగా వెంకటేశ్వర్లు మనస్తాపానికి గురై ఈ నెల 14న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే విషయాన్ని అక్కడి అధికారులు ఫోన్‌లో ధ్రువీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, దుబాయ్ ప్రభుత్వం అనుమతితో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన

దేవరకొండ: సకాలంలో వైద్యం అందించక శిశువు మృతిచెందిందని ఆరోపిస్తూ మంగళవారం కుటుంబ సభ్యులు, బంధువులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణానికి చెందిన నోముల అఖిలకు మొదటి కాన్పులో పురిటి నొప్పులు రావడంతో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. విధుల్లో ఉన్న డాక్టర్లు శశికళ, కృష్ణలు అఖిలను పరీక్షించి అప్పటికే కడుపులో ఉన్న శిశువు మృతిచెందినట్లు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం అఖిలను నల్లగొండకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో హుటాహుటిన అంబులెన్స్ వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి వద్ద అఖిల ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాగా అప్పటికే శిశువు మృతిచెందింది. ఇదిలా ఉంటే సకాలంలో వైద్యం అందకనే శిశువు మృతిచెందిందని బంధువులు ఆరోపించి కొద్దిసేపు ఆందోళనకు దిగారు.

ఆరోపణలు అవాస్తవం..

అఖిలకు పూర్తిస్థాయి వైద్యం అందించామని, మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు రెఫర్ చేసినట్లు వైద్యులు రవి, కృష్ణ తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని వారు పేర్కొన్నారు. దీంతో అఖిల బంధువులు మృతశిశువును తీసుకొని వెళ్లిపోయారు.

గిట్టుబాటు ధర దక్కలేదనే ఆవేదనతో..

- రోడ్డు వెంట జామకాయలు పారబోసిన రైతు
- ఎగబడి తీసుకెళ్లిన స్థానికులు, వాహనదారులు



రోడ్డు వెంట పారబోసిన జామకాయలను తీసుకుంటున్న స్థానికులు

చౌటుప్పల్: తన తోటలోని జామకాయలను అమ్మేందుకు మార్కెట్‌కు వెళ్లిన రైతుకు సరైన మద్దతు ధర లభించకపోవడంతో, తక్కువ ధరకు అమ్ముకునేందుకు మనసు అంగీకరించలేదు. దీంతో జామకాయలు అమ్మగా వచ్చే డబ్బులు రవాణా ఖర్చులకు కూడా సరిపోవన్న ఆవేదనతో రోడ్డు వెంట పారబోశాడు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నూజివీడు ప్రాంతానికి చెందిన రైతు వెంకటేశ్వర్‌రావు జామ తోట దిగుబడికి వచ్చింది. దీంతో పంటను విక్రయించేందుకు గాను సోమవారం రాత్రి బాక్సుల్లో(ట్రేలలో) జామకాయలు నింపి గూడ్స్ వాహనంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెంలోని పండ్ల మార్కెట్‌కు తీసుకెళ్లాడు. సాధారణంగా ఒక్కో బాక్సు ధర రూ.700 నుంచి రూ.800 ఉండాల్సి ఉంది. కానీ మంగళవారం మాత్రం వ్యాపారులు ఒక్కో బాక్సుకు కేవలం రూ.220 మాత్రమే ధర పెట్టారు. ఈ ధరకు పంట అమ్మితే రవాణా ఖర్చులకు కూడా సరిపోవని ఆవేదనకు గురైన వెంకటేశ్వరరావు అంత తక్కువ ధరకు పంటను అమ్మడం ఇష్టం లేక జామ లోడుతో తిరిగి నూజివీడుకు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా దాటాక గుండ్లబావి గ్రామ శివారులో జాతీయ రహదారి వెంట జామకాయలను పారబోశాడు. స్థానికులు గమనించి దగ్గరకు వెళ్లి పలకరించగా ఆ రైతు తన బాధను వారితో చెప్పుకున్నాడు. కాగా జామకాయలు పారబోసిన విషయాన్ని చూసిన స్థానికులు, వాహనదారులు ఎగబడ్డారు. జామకాయలను సంచులు, బస్తాల్లో నింపుకొని తీసుకెళ్లారు. క్షణాల్లో రోడ్డు వెంట ఉన్న జామకాయలు ఖాళీ అయ్యాయి. ఇదిలా ఉండగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం కిలో జామకాయలు రూ.60 నుంచి రూ.80 ధర పలుకుతుండడం గమనార్హం. ఈ సంఘటనపై పలువురు రైతులు పాలకులను, దళారులను నిందించారు.

విద్యార్థినిపై కరస్పాండెంట్ లైంగిక వేధింపులు

- పాఠశాల ఎదుట విద్యార్థినులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన
- కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు.. అరెస్ట్



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి: విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్లో 41మంది విద్యార్థులు పదో తరగతి అభ్యస్తున్నారు. వార్షిక పరీక్షల నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా, ఈ నెల 19వ తేదీన రోజు మాదిరిగా ప్రత్యేక తరగతులు ముగిసిన అనంతరం ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు అయితే, అందులో ఓ విద్యార్థిని కుటుంబ సభ్యులు రాకపోవడాన్ని అదునుగా భావించిన కరస్పాండెంట్ రఘు వెంకటసురేష్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించాడు. అనంతరం ఆ విద్యార్థిని ఆలస్యంగా ఇంటికి వెళ్లింది. అదే రోజు పాఠశాలలో కరస్పాండెంట్ రఘువెంకటసురేష్ కుమార్ తన అసభ్యంగా ప్రవర్తించినట్లు తల్లిదండ్రులకు చెప్పింది. అనంతరం ఈ నెల 20వ తేదీన పదో తరగతికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఇదే విషయాన్ని చెప్పారు. దీంతో వీరంతా మంగళవారం మధ్యాహ్నం పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలలను వదిలిపెట్టే సమయంలో పదో తరగతిలోని 20 మంది విద్యార్థినులు గేటు ఎదుట నిరసనకు దిగారు. వీరికి పలు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కరస్పాండెంట్‌తో వాగ్వాదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న బాలల పరిరక్షణ అధికారులు, డీఈఓ నారాయణరెడ్డి, డీసీపీ భువనగిరి జోన్ డీసీపీ రాజేశ్ చంద్ర, ఏసీపీ వెంకట్ రెడ్డి తదితరులు పాఠశాలలోనే పదో తరగతి విద్యార్థినులతో ప్రత్యేకంగా తరగతి గదిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు ఫిర్యాదు మేరకు కరస్పాండెంట్ రఘువెంకటసురేష్, ప్రిన్సిపాల్ సుజాతను అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. పాఠశాలలో ఘటకు సంబంధించిన విషయాలను సీసీ ఫుటేజ్ నుంచి తొలగించారని, సాంకేతిక నిపుణులను తీసుకువచ్చి తిరిగి రికార్డును తీసుకునే ప్రయత్నం చేస్తామన్నారు. వాటిని సీజ్ చేసి కోర్టుకు అందజేస్తామని డీసీపీ రాజేశ్ చంద్ర తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనాలతో ప్రజల్లోకి..

- బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చిత్రంలో విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి: సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలతో ప్రజల్లోకి వెళ్తున్నామని బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తెలిపారు. మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 14న రాష్ట్రస్థాయిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో అన్ని గ్రామాలల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని పార్టీ ఆదేశించిందన్నారు. నియోజకవర్గం ఎమ్మెల్యే నిర్ణయించిన గ్రామాలను కలుపుతూ ఒక క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇచ్చిన తేదీల్లో పెద్దఎత్తున ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 14న హైదారాబాద్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు దళితులను పెద్దఎత్తున తరలించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 25న నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అక్టోబర్ 1న ఎన్నికల సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం విప్ సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గంలో పది గ్రామాలను కలుపుకుని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ నెల 27న రాజాపేట మండలం రఘునాథపురంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 17వ తేదీ వరకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ సభ్యులు సుబ్బూరు బీరుమలయ్య, భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన నరేంద్ర మోదీ

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



రామన్నపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ శ్రేణులు

రామన్నపేట: ప్రధాని మోదీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీసి దేశసంపదను అదానీ, అంబానీ వంటి దోస్తులకు దోచిపెడుతున్నారని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రామన్నపేటలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులను నిలదీయాలన్నారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దిక్కుమొక్కు లేని పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను భారీ మెజార్టీతో తిరిగి గెలిపించుకునే బాధ్యత పార్టీశ్రేణులపై ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కేంద్రంలోని మోదీ సర్కార్ అడ్డుకుంటుందన్నారు. సమ్మేళనానికి ముందు రైస్ మిల్లు నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో జెడ్పీచైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి డైరెక్టర్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలఫోరం అధ్యక్షుడు గుత్తా నర్సింహారెడ్డి, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, గ్రామశాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పనులు సక్రమంగా నిర్వహించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



గుండాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గుండాల: మండలంలోని పాచిల్ల, గుండాల నర్సరీలను కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీల్లోని మొక్కల్లో ఎదుగుదల లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీలతో పాటు పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలు ఉండటంతో ఇదేంటని అధికారులను ప్రశ్నించారు. నర్సరీ పనులు సక్రమంగా లేకపోవడంతో గుండాల, పాచిల్ల పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ కొత్త మొక్కలు నాటాలని సూచించారు. నర్సరీ పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం గుండాల మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్ని వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా వైద్యాధికారులు కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో మహిళలను చైతన్యపరిచి వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట డాక్టర్ హైమావతి, తహసీల్దార్ జి.జ్యోతి, ఎంపీడీఓ జి.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

ఆలేరురూరల్: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను ఆమె పరిశీలించారు. పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం కళాశాల బిల్డింగ్‌ను పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన బిల్డింగ్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి సమాచారం అందిస్తానని తెలిపారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



భువనగిరి టౌన్: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భువనగిరిటౌన్: మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు, శ్మశాన వాటికల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా కాంట్రాక్టర్లు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు ఇచ్చి, కాంట్రాక్టులను రద్దు చేయాలన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ, అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్, మున్సిపల్ కమిషనర్ల గ్రౌండింగ్ పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూళ్లు 100 శాతం వసూలు చేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పనుల పరిశీలన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని అంగడి బజార్‌లో అధునాతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. యాదగిరిపల్లి బీసీ కాలనీ, చికెన్ మార్కెట్ యార్డు పక్కన, బీసీ కాలనీలో కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేస్తున్న పార్కుల స్థలాలను పరిశీలించారు. 6వ వార్డులో రూ.కోటితో చేపట్టిన మోడ్రన్ శ్మశాన వాటిక పనుల పురోగతిని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. వీటితో పాటు 5వ వార్డులో కమ్యూనిటీ హాల్ పక్కన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, యోగానంద నిలయం పక్క నుంచి బీసీ కాలనీ చివరి వరకు ఉన్న ఓపెన్ డ్రెయినేజీకి ఇరువైపులా ఫెన్సింగ్ చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి, మున్సిపల్ అధికారులు సాయి తదితరులున్నారు.